క్లుప్తంగా

ఎన్‌ఎస్‌యూఐ మండల ఉపాధ్యక్షుడిగా రాకేష్

చారకొండ: ఎన్‌ఎస్‌యూఐ మండల ఉపాధ్యక్షుడిగా మండలంలోని గోకారానికి చెందిన జమ్ముల రాకేష్ ఎన్నికయ్యారు. శనివారం మండల అధ్యక్షుడు బాల్‌రాంగౌడ్ మండల కేంద్రంలో నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు బాల్‌రాంగౌడ్ మాట్లాడారు. పార్టీలో పనిచేసిన వారికి సముచిత స్థానం ఉంటుందని అన్నారు. విద్యార్థుల సమస్యలపై పనిచేస్తానని రాకేష్ అన్నారు. కార్యక్రమంలో శివ తదితరులు పాల్గొన్నారు.

దాహం తీరుస్తున్న చలివేంద్రం



తాడూరు: మండల కేంద్రంలో బస్టాండ్ వద్ద గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం ఆయా గ్రామాలకు వెళ్లే ప్రయాణికుల దాహార్తిని తీరుస్తుంది. పంచాయతీ కార్యదర్శి పవన్‌కుమార్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రతిరోజూ తాగునీటిని అందించడంతో పాటు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రోజువారి కూలీ చెల్లిస్తూ.. ఓ వ్యక్తిని ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాలకు వెళ్లే ప్రయాణికుల దాహం తీర్చేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రం నిర్వాహకులను వివిధ గ్రామాల నుంచి వచ్చే ప్రయాణికులు అభినందిస్తున్నారు. ఆయా పార్టీలకు ప్రచారం చేసే నాయకులు సైతం చలివేంద్రంతో దాహార్తిని తీర్చుకుంటున్నారు.

నాయకుల పరామర్శ



నాగర్‌కర్నూల్‌రూరల్: శ్రీకాళహస్తీలో ప్రచారం నిర్వహిస్తున్న ఆర్ కృష్ణయ్యపై దాడి చేయడం అనైతిక చర్య అని బీసీ సంక్షేమ సంఘం నాగర్‌కర్నూల్ జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ కుంభం మల్లేష్‌గౌడ్ అన్నారు. శనివారం ఆయనతో పాటు మరికొంత మంది బీసీ నాయకులు హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న ఆర్. కృష్ణయ్య నివాసానికి వెళ్లి పరామర్శించారు.

లింగాలలో 30,904 ఓటర్లు

లింగాల: మండలంలోని 23 గ్రామపంచాయతీలకు గానూ మొత్తం 30,904 ఓటర్లు ఉన్నారని ఎన్నికల అధికారి తహసీల్దార్ ఉమ తెలిపారు. వీరిలో పురుషులు 15,280, మహిళలు 15,623 ఉన్నారని తెలియజేశారు. మండల వ్యాప్తంగా 47 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలియజేశారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



తాడూరు: మండలంలోని మేడిపూర్‌లో ఏర్పాటు చేసిన వాహనాల తనిఖీ కేంద్రం వద్ద పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. శనివారం ఎన్నికల ప్రచారం ముగియనున్న దృష్ట్యా వాహనాల రద్దీ ఎక్కువ కావడంతో తనిఖీలు ముమ్మరంగా చేపట్టారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేసి వివరాలను పొందుపరుస్తున్నట్లు ఎస్‌ఐ మహేష్ తెలియజేశారు.

మూడో విడత ర్యాండమైజేషన్ పూర్తి



మూడో విడత ర్యాండమైజేషన్‌లో పాల్గొన్న ఎన్నికల సాధారణ పరిశీలకులు రుచేస్ జైవన్షీ

నాగర్‌కర్నూల్: ఎన్నికల సిబ్బంది మూడో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేసినట్లు ఎన్నికల సాధారణ పరిశీలకులు రుచేస్ జైవన్షీ, రిటర్నింగ్ అధికారి ఉదయ్‌కుమార్ తెలియజేశారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల పోలింగ్ సిబ్బందికి సంబంధించి మూడో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను ఎన్నికల సాధారణ పరిశీలకులు రుచేస్ జైవన్షీ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో చేపట్టారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లోని ఎన్‌ఐసీ హాల్‌లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల నిబంధనల ప్రకారం పారదర్శకంగా ఎన్‌ఐసీ సాఫ్ట్‌వేర్ వినియోగిస్తూ.. ఆన్‌లైన్‌లో పోలింగ్ సిబ్బందికి సంబంధించిన మూడో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఉదయ్ కుమార్ మాట్లాడారు. నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్ నియోజకవర్గాలకు సంబంధించి మొత్తం 905 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి మూడో విడత ర్యాండమైజేషన్ ద్వారా ఎంపిక చేశామన్నారు. ఐదు నియోజకవర్గాలకుగాను 1038 టీమ్స్ ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ సిబ్బందికి మూడో ర్యాండమైజేషన్ కేటాయింపు ప్రక్రియ చేపట్టినట్లు చెప్పారు. 905 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వీటికి ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, ఓపిఓలను కేటాయించామన్నారు. ఒక్కో పోలింగ్ బృందంలో, ఒక ప్రిసైడింగ్, ఒక సహాయ ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు పోలింగ్ సిబ్బంది ఉంటారని పోలింగ్ సిబ్బందికి, సూక్ష్మ పరిశీలకులకు ఆయా రిటర్నింగ్ అధికారులు ఆదివారం పోలింగ్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో ఉత్తర్వులు అందజేస్తారన్నారు. పోలింగ్ సిబ్బంది ఆ ఉత్తర్వుల మేరకు చెక్‌లిస్ట్ ప్రకారం పోలింగ్ మెటీరియల్, ఈవీఎంలను సరిచూసుకుని ఆయా కేంద్రాలకు వెళ్లాలని తెలియజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్, కుమార్ దీపక్, సీతారామారావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వంద శాతం పోలింగ్ నమోదయ్యేలా చర్యలు

నాగర్‌కర్నూల్: ప్రతి ఓటరు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఓటు వేయాలంటే గుర్తింపు కార్డు తప్పనిసరిగా ఉండాలని ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఉదయ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందన్నారు. వాస్తవానికి ప్రతిసారి సాయంత్రం 5 గంటల వరకే పోలింగ్ గడువు ముగిసేదని, ఈసారి దానిని మరో గంట పాటు పొడిగించడం జరిగిందన్నారు. నిర్ణీత సమయం లోపు పోలింగ్ కేంద్రం వద్దకు వచ్చిన వారికి సైతం ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పిస్తారని తెలిపారు. ప్రతి ఓటరు తప్పనిసరిగా ఓటు వేయాలని, ప్రజాస్వామ్య ప్రాధాన్యతను చాటిచెప్పాలని సూచించారు.

63,328 మంది యువతీ, యువకులు..

18 నుంచి 19 సంవత్సరాల యువతీ, యువకులు 63,328 తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని చెప్పారు. వీరంతా పోలింగ్‌లో పాల్గొని తొలి ఓటు అనుభూతి పొందాలని తెలియజేశారు. ప్రజాస్వామ్య దేశంలో అన్ని దేశాలకంటే యువత ఎక్కువగా ఉన్నారని, రాజకీయ నిర్ణయాధికారం యువతదేనని, చైతన్య వంతులై వంద శాతం పోలింగ్ నమోదయ్యేలా చూడాలన్నారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఫొటోతో ఉన్న ఓటరుకార్డు లేదా ఎన్నికల సంఘం నిర్దేశించిన గుర్తింపు కార్డులో ఏదైనా ఒకదాన్ని పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లాలన్నారు. ఓటర్ ఎపిక్ కార్డు, ఆధార్ కార్డు, మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్డ్, బ్యాంక్ /పోస్టాఫీస్ (ఫొటోతో ఉన్నవి) పాస్ బుక్‌లు, కార్మిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, జాతీయ జనాభా రిజిస్టరు జారీ చేసిన స్మార్ట్ కార్డ్, భారత పాస్ పోర్ట్, ఫొటోతో ఉన్న పింఛన్ పత్రం, ఉద్యోగులకు కేంద్ర/ రాష్ట్ర ప్రభుత్వం/ ప్రభుత్వ సంస్థలు / పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు జారీ చేసిన ఫొటో గుర్తింపుకార్డు, దివ్యాంగుల గుర్తింపుకార్డు, చట్ట సభలలో సభ్యత్వాన్ని చూపే అధికారిక గుర్తింపు కార్డ్‌లో ఏదో ఒక గుర్తింపు కార్డ్‌ను తీసుకొని పోలింగ్ స్టేషన్‌కి వచ్చి ఓటు వేయాలన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా పార్లమెంట్ నియోజకవర్గాల ఎన్నికల బరిలో 19 మంది అభ్యర్థులు ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని తెలియజేశారు.

మోదీ సహకారంతో అభివృద్ధి

- నాగర్‌కర్నూల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్



జిల్లా కేంద్రంలో బైక్‌ర్యాలీ అనంతరం మాట్లాడుతున్న భరత్‌ప్రసాద్

సాక్షి, నాగర్‌కర్నూల్: నాగర్‌కర్నూల్ గడ్డపై ఈసారి బీజేపీ జెండా ఎగరడం ఖాయమని నాగర్‌కర్నూల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్ అన్నారు. శనివారం ఎన్నికల ప్రచార ముగింపు సందర్భంగా బిజినేపల్లి మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రంలోని బస్టాండ్ వరకు నిర్వహించిన బైక్ ర్యాలీలో మాట్లాడారు. నాగర్‌కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ గెలుపొంది చరిత్ర సృష్టించనుందని చెప్పారు. ఈ ప్రాంతానికి రైలు కూత వినిపించాలన్నా, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో అభివృద్ధి పరుగులు పెట్టాలంటే బీజేపీకి ఓటు వేయాలని కోరారు. దేశ భద్రత, అభివృద్ధి కోసం ఈ ఎన్నికలు జరుగుతున్నాయని చెప్పారు. అభివృద్ధి పేరుతో కమీషన్లు దండుకున్న బీఆర్‌ఎస్‌కు ఓటు వేయద్దని అన్నారు. ఎంపీ రాములు మాట్లాడుతూ.. దేశం రక్షణ కోసం పాటుపడుతూ క్రమశిక్షణ కలిగిన ఏకైక పార్టీ బీజేపీ అని చెప్పారు. ర్యాలీలో ఎంపీ రాములు, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, బీజేపీ నేతలు దిలీపాచారి, జక్కా రఘునందన్‌రెడ్డి పాల్గొన్నారు.



గోకారంలో ప్రచారం చేస్తున్న శేఖర్ రెడ్డి

చారకొండ: దేశంలో బీజేపీతోనే దేశ రక్షణ, సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని కల్వకుర్తి నియోజకవర్గ అసెంబ్లీ ఇన్‌చార్జ్ శేఖర్ రెడ్డి అన్నారు. మండలంలోని జూపల్లి, గోకారం గ్రామాల్లో శనివారం బీజేపీ అభ్యర్థి భరత్ ప్రసాద్‌కు మద్దతుగా ప్రచారం చేశారు. కమలం గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లను నమ్మొద్దని అన్నారు. మోసపూరిత హామీలతో కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారం చేపట్టిందని అన్నారు. దేశంలో నరేంద్రమోదీ నాయకత్వంలో ఎన్‌డీఏ అధికారం చేపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. హరిబాబు, రాములు, వెంకటేష్, వెంకటయ్య, రామకృష్ణ, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా ప్రచారం

కల్వకుర్తి రూరల్: మండలంలోని ముకురాల, తర్నికల్, గుండూరు, లింగసానిపల్లితో పాటు కల్వకుర్తి పట్టణంలోని 22 వార్డుల పరిధిలో భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్లమెంట్ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌కు మద్దతుగా విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో ఉపాధి కూలీలతో మాట్లాడి మోదీ ప్రధాని కావడానికి బీజేపీకి ఓటు వేయాలని కోరారు. నర్సిరెడ్డి, రామచంద్రారెడ్డి, కృష్ణగౌడ్, రాఘవేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బైక్ ర్యాలీ

అమ్రాబాద్: మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం బీజేపీ బైక్ ర్యాలీ నిర్వహించారు. దేశంలో ప్రధాని మోదీ ఉంటేనే దేశ రక్షణ జరుగుతుందని నినాదాలు చేశారు.



అమ్రాబాద్‌లో బీజేపీ బైక్ ర్యాలీ

కాంగ్రెస్‌లో ఎంపీటీసీ చేరిక



కల్వకుర్తి రూరల్: మండలంలోని కురుమిద్ద ఎంపీటీసీ శంకర్‌నాయక్ శనివారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శంకర్‌నాయక్‌కు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఇందిరాశోభన్, ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అచ్చంపేట రూరల్: మద్దిమడుగు ఆలయ కమిటీ తాజా మాజీ చైర్మన్, మాజీ కౌన్సిలర్ డాక్టర్ విష్ణుమూర్తి, ఆయన సోదరుడు సింగిల్ విండో డైరెక్టర్ యు.ఎల్ చారితో పాటు పలువురు బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి శనివారం ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు కపిలవాయి చంద్రమోహన్, సతీష్‌చారి, వెంకటయ్య, రఘుపతిరెడ్డి పాల్గొన్నారు.

డీఎంహెచ్‌ఓకు వినతి



నాగర్‌కర్నూల్ రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం కొనసాగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో పాల్గొంటున్న ఆశా కార్యకర్తల ఎలక్షన్ విధుల్లో పాల్గొంటారని, వారికి ఆ రోజు డబ్బులు చెల్లించాలని ఆశా కార్యకర్తల యూనియన్ నాయకులు శనివారం డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్‌కు వినతి అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పొదిల రామయ్య మాట్లాడారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, సహాయ కార్యదర్శి వసుంధర, గౌరమ్మ, సుంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం మార్పు



గుంతకోడూరులో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న రోహిని



నాగర్‌కర్నూల్‌లో మాట్లాడుతున్న తెలంగాణ మాదిగ దండోరా వ్యవస్థాపకుడు సతీష్ మాదిగ

నాగర్‌కర్నూల్ క్రైం: బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం మార్పుతో పాటు రిజర్వేషన్లను తొలగించేందుకు కుట్ర చేస్తుందని తెలంగాణ మాదిగ దండోరా వ్యవస్థాపకుడు సతీష్ మాదిగ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలన అవినీతిమయమేనని, రూ.7 లక్షల కోట్ల అప్పు మిగిల్చారని అన్నారు. కేఎల్‌ఐ ప్రాజెక్టును గత కాంగ్రెస్ ప్రభుత్వమే పూర్తిచేసిందని, బీఆర్‌ఎస్ హయాంలో ఏమి జరగలేదని అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు పెంచుతుందని అన్నారు. సమావేశంలో తెలంగాణ ప్రజాసంఘాల అధ్యక్షుడు గజ్జల కాంతం, వరప్రసాద్ పాల్గొన్నారు.

మతప్రాతిపదికన దేశాన్ని విభజిస్తుంది

బీజేపీ మతప్రాతిపదికన దేశాన్ని విభజించాలని చూస్తుందని తెలంగాణ హజ్ కార్పొరేషన్ చైర్మన్ ఎండీ బియా బస్‌కుస్రో అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ముస్లిం, మైనార్టీ ఓటు చీలకుండా ఉండటం కోసం కాంగ్రెస్ పార్టీకి తప్పనిసరిగా ఓటు వేయాలని కోరారు. లోక్‌సభ ఎన్నికల పోలింగ్ రోజున ముస్లింలందరూ వందశాతం పోలింగ్ జరిగేందుకు సహకరించాలని కోరారు. సమావేశంలో ముస్లిం, మైనార్టీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు హబీబ్ ఉర్ రహమాన్, సుభాన్, ఫరీద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

కల్వకుర్తి రూరల్: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కాయితీ ఆశాదీప్‌రెడ్డి అన్నారు. శనివారం కల్వకుర్తి మండలం తాండ్ర, జీడిపల్లి గ్రామాల్లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి మల్లురవికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు దిశగా అడుగులు వేస్తూ.. ముందుకు సాగుతున్నామన్నారు.

ముమ్మర ప్రచారం

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో మల్లురవి గెలుపు కోసం జెడ్పీటీసీ రోహిని, ఎంపీటీసీ రేణుక, కాంగ్రెస్ నాయకురాలు వసంత మండలంలోని గుంతకోడూరు ఉపాధి కూలీలతో మాట్లాడారు. దేశ భవిష్యత్‌కు కాంగ్రెస్ పార్టీ అవసరమన్నారు.

మల్లురవిని ఆదరించండి

తెలకపల్లి: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లురవిని ఆదరించి గెలిపిస్తే అభివృద్ధి చేస్తాడని జెడ్పీటీసీ సభ్యురాలు సుమిత్ర అన్నారు. శనివారం మండల పరిధిలోని గౌరారంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ కూలీల వద్దకు వెళ్లి మల్లురవిని గెలిపించాలని అభ్యర్థించారు. ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందాలన్నా.. ప్రభుత్వ పథకాలు నేరుగా ప్రజలకు అందాలన్నా.. మల్లురవిని గెలిపించాలన్నారు. జెడ్పీటీసీ సుమిత్రతో పాటు కాంగ్రెస్ నాయకులు రాజారెడ్డి, రాము, గణేష్, రవికుమార్ పాల్గొన్నారు.

సీపీఎం నాయకులు..

పెంట్లవెల్లి: మండలంలోని కొండూరులో శనివారం సీపీఎం నాయకులు ఈశ్వర్, కొండూరు మాజీ సర్పంచ్ గోపాల్ ఉపాధి కూలీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడారు. కాంగ్రెస్ అభ్యర్థి మల్లురవికి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఉపాధి కూలీలను కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రవి, ఎల్లగౌడ్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థినే గెలిపించాలి

నాగర్‌కర్నూల్ రూరల్: కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్న డా.మల్లురవినే గెలిపించాలని దళిత పొలిటికల్ జేఏసీ చైర్మన్ వంగూరి జయశంకర్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక రూబీ గార్డెన్‌లో ఆ సంఘం నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మల్లురవి గెలిస్తే ప్రజలకు తగిన న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



మల్లురవిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు సుమిత్ర

కొల్లాపూర్‌లో ప్రచారం

కొల్లాపూర్: కాంగ్రెస్ నాయకులు శనివారం ఇంటింటి ప్రచారాలు నిర్వహించారు. సీపీఐ, సీపీఎం నాయకులు కూడా ప్రచారాల్లో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో రంగినేని జగదీశ్వరుడు, నర్సింహారావు, రహీంపాష, రమ్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీగా మల్లురవిని గెలిపించాలి

అమ్రాబాద్: డాక్టర్ మల్లురవిని గెలిపించాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు రాజ్‌గోపాల్ కోరారు. శనివారం అమ్రాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. బీజేపీ, బీఆర్‌ఎస్ గుర్తులు వేరైనా ఇద్దరి అనుబంధం ఒక్కటే అని ఆరోపించారు.

కాంగ్రెస్‌కు ఓటు.. భవిష్యత్‌కు చోటు

బల్మూర్: కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి దేశ భవిష్యత్‌కు చోటు కల్పించాలని ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ కోరారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం చివరి రోజు కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ అభ్యర్థి డా.మల్లు రవికి మద్దతుగా బల్మూర్‌లో నిర్వహించిన రోడ్ షోలో ఆయన ప్రసంగించారు. కార్యక్రమంలో మోపతయ్య, వెంకట్‌రెడ్డి, నర్సింగ్‌రావు, సుధాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

మెజార్టీ ఇవ్వండి

బిజినేపల్లి: చేతి గుర్తుపై ఓటువేసి డా.మల్లురవికి అత్యధిక మెజార్టీ ఇవ్వాలని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి అభ్యర్థించారు. శనివారం తిమ్మాజిపేట మండలంలోని కోడుపర్తి, అప్పాజిపల్లి, గోరిట గ్రామాల్లో పర్యటించి ప్రచారం నిర్వహించారు.

ఓటుతో బుద్ధి చెప్పాలి

అచ్చంపేట: ప్రజ్యాస్వామ్యం రక్షించబడాలంటే దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. అచ్చంపేట అంబేద్కర్ చౌరస్తాలో ఎన్నికల ప్రచారం చివరి రోజు నిర్వహించిన ర్యాలీ, రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్, బీజేపీలు రెండూ ఒక్కటేనని వారికి ఓటేస్తే ఆగం కావడం ఖాయమన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లు రవిని గెలిపిస్తే నియోజకవర్గం మరింత అభివృద్ధి చేసుకునే వీలుందన్నారు.

ప్రశ్నించే గొంతుకలను ఎన్నుకోండి



అచ్చంపేటలో విలేకరులతో మాట్లాడుతున్న గువ్వల బాలరాజు

అచ్చంపేట: పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు ఓటు వేసే ముందు అర్హతలను పరిగణలోకి తీసుకోవాలని, ప్రశ్నించే గొంతుకలను ఎన్నుకోవాలని అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పిలుపునిచ్చారు. శనివారం అచ్చంపేటలో విలేకరులతో మాట్లాడారు. ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ గెలిస్తే ఢిల్లీ నుంచి రూ.వేల కోట్ల నిధులు తెచ్చే సత్తా ఉన్న నాయకుడని, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ రూపురేఖలు మారుతాయన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే కాంగ్రెస్ నాయకులు ఇసుక, మైనింగ్ మాఫియాకు తెరలేపారని ఆరోపించారు. గతంలో ఇసుక విషయంలో అసత్య ప్రచారాలు చేసిన నాయకులు ఇప్పుడు వారు చేస్తుంది ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నర్సింహగౌడ్, పీఏసీఎస్ చైర్మన్లు నర్సయ్యయాదవ్, రాజిరెడ్డి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే పేదలకు పథకాలు

వెల్దండ: రాష్ట్రంలోని ప్రజల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ఎంతో కృషి చేసిందని, ప్రజలకు కేసీఆర్‌ని ఆదరిస్తున్నట్లు రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని పోతేపల్లిలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి హామీలను నెరవేర్చడం లేదన్నారు. రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయినట్లు పేర్కొన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు ఓట్లు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పుట్టరాంరెడ్డి, నాయకులు ఐజాక్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నాగులు నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం

కల్వకుర్తి రూరల్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా శనివారం జీడిపల్లి, కుర్మిద్ద, వెంకటాపూర్ గ్రామాల్లో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు విజయ్‌గౌడ్, వైస్‌ఎంపీపీ గోవర్ధన్ ఆధ్వర్యంలో జోరుగా ప్రచారం నిర్వహించారు.

బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారం

తెలకపల్లి: మండల పరిధిలోని దాసుపల్లి, తెలకపల్లి తదితర గ్రామాల్లో శనివారం బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌ను ఎంపీగా గెలిపించి ఆశీర్వదించాలని కోరారు.



కల్వకుర్తిలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ప్రమాదభరితంగా నీటి ట్యాంక్‌లు

- తుప్పపట్టిన ఇనుప నిచ్చెనలతో అవస్థలు
- శుభ్రం చేసేందుకు జంకుతున్న గ్రామపంచాయతీ సిబ్బంది
- ఆర్నెళ్లకు ఒకసారైన చేపట్టని నీటి క్లోరినేషన్
- తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామాల ప్రజలు



ఉప్పునుంతల బీసీ కాలనీలో శిథిలావస్థకు చేరి ప్రమాదభరితంగా మారిన నీటి ట్యాంక్



ఇనుప చువ్వలు తేలి కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న నీటి ట్యాంక్

ఉప్పునుంతల: మండల పరిధిలోని గ్రామాల్లో కొన్నేళ్ల కిందట నిర్మించిన రక్షిత తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు ప్రస్తుతం ప్రమాదభరితంగా మారాయి. ట్యాంక్‌ల పిల్లర్లు సిమెంట్ పెచ్చులు రాలిపడి తుప్పుపట్టిన ఇనుప చువ్వలు తేలాయి. ట్యాంక్‌ల పైకి ఎక్కడానికి ఏర్పాటు చేసిన ఇనుప నిచ్చెనలు తుప్పుబట్టిపోవడంతో గ్రామ పంచాయతీ సిబ్బంది ట్యాంక్‌లు ఎక్కి శుభ్రం చేసేందుకు జంకుతున్నారు. క్లోరినేషన్ చేయాలని అధికారులు ఒత్తిడి చేసినప్పుడు మాత్రమే ట్యాంక్‌ల పైకి తాళ్లు కట్టుకొని ఎక్కి బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్నారు.

- లక్ష్మాపూర్ ఎస్సీ కాలనీలో ఇళ్ల మధ్యన ఉన్న ఓవర్‌హెడ్ నీటి ట్యాంక్ ప్రమాదభరితంగా ఉండటంతో అధికారులే దాన్ని నాలుగేళ్ల కిందట కూల్చివేశారు.
- ఉప్పునుంతల బీసీ కాలనీలోని వాటర్ ట్యాంక్ ప్రమాదస్థితికి చేరుకుంది. ట్యాంక్ ఎక్కడానికి ఏర్పాటుచేసిన ఇనుప నిచ్చెన తుప్పుబట్టి మధ్యలో విరిగిపోయింది. ప్రస్తుతం ఆ ట్యాంక్ నుంచే నీటి సరఫరా జరుగుతుంది.
- మండలంలోని వెల్టూర్‌లోని పాత వాటర్ ట్యాంక్ పరిస్థితి అధ్వనంగా ఉంది.
- ఈరట్యానిపల్లి, లత్తీపూర్ గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు ఎక్కడానికి ఏర్పాటు చేసిన ఇనుప నిచ్చెనలు తుప్పుబట్టిపోయాయి.
- అదే విధంగా మండల పరిధిలోని దాదాపు అన్ని గ్రామాల్లోని పాత నీటి ట్యాంక్‌ల పరిస్థితి మరీ దారుణంగా ఉన్నాయి. ప్రస్తుతం ఆయా ట్యాంక్‌ల ద్వారా నీటి సరఫరా జరుగుతుంది. దాంతో తాగునీటి క్లోరినేషన్ సరిగా జరగడం లేదు. మండలంలో కొన్నేళ్ల కిందట నిర్మించిన పాత ట్యాంక్‌లు 24 ఉన్నాయి. వాటిలో సగానికి పైగా శిథిలావస్థకు చేరాయి. అదేవిధంగా మిషన్ భగీరథలో నిర్మించిన ట్యాంక్‌లు 32 ఉన్నాయి. వాటిలో కొన్నింటికి ట్యాంక్ పైకి ఎక్కడానికి నిచ్చెనలు ఏర్పాటు చేసినా పైనుంచి ట్యాంక్‌లోకి దిగడానికి నిచ్చెన సదుపాయాలు కల్పించకుండా వదిలేయడంతో గ్రామపంచాయతీ సిబ్బంది ప్రమాదభరితంగా ప్రాణాలకు తెగించి ట్యాంకుల్లోకి దిగాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్రామాల్లో పరిస్థితుల ప్రభావం, అధికారుల పట్టింపులేకపోవడంతో నెలకు మూడు దఫాలు చేయాల్సిన వాటర్ ట్యాంక్‌ల శుభ్రత, క్లోరినేషన్ ఆర్నెళ్లకు ఒకసారైనా జరగడం లేదు. ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చుచేసి మిషన్ భగీరథ నీటిని అందిస్తున్నా.. ఆ నీరు సరిగా లేక ప్రజలకు ఆ పథకంతో ఏ మాత్రం ప్రయోజనం చేకూరడంలేదు. గ్రామాల్లో ప్రతి కుటుంబం తాగునీటికి డబ్బులు పెట్టి కొనుగోలు చేసుకుంటున్నారు. సంబంధిత అధికారులు, శిథిలావస్థకు చేరుకున్న నీటి ట్యాంక్‌లపై శ్రద్ధ తీసుకొని మరమ్మతు చేయించాలని, కొళాయిల ద్వారా అందిస్తున్న తాగునీటి శుభ్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పాత ట్యాంకుల మరమ్మతు గ్రామ పంచాయతీలకే..

పాత ట్యాంకులను ఎక్కడానికి ఇనుప నిచ్చెనలు, తదితర మరమ్మతులను గ్రామ పంచాయతీ నిధులతో చేయించాలని ఇంతకు ముందు నుంచి సర్పంచ్‌లకు సూచించాం. పూర్తిగా శిథిలావస్థకు చేరిన ట్యాంకుల్లో లక్ష్మాపూర్‌లో ఒకటి కూల్చి వేయించాం. ఉప్పునుంతల, వెల్టూరు, ఈరట్యానిపల్లిలో శిథిలావస్థకు చేరిన ఓవర్‌హెడ్ ట్యాంక్‌లను కూల్చి వేయాలని గ్రామపంచాయతీల వారికి ఇదివరకే తెలియజేశాం. మిషన్ భగీరథలో కొత్తగా నిర్మించిన నీటి ట్యాంకుల వద్ద ఆ ఇబ్బందులు ఏమి లేవు.

– సాయికృష్ణ, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్, ఉప్పునుంతల మండలం